## క్లుప్తంగా

### మంచినీటి సమస్య పరిష్కారం

కడప కల్చరల్ : కడప నగరం 48వ డివిజన్‌లోని కృపా కాలనీలో పలు సంవత్సరాలుగా ఉండిన మంచి నీటి సమస్య తీరిపోయింది. ఇటీవల స్థానిక న్యూ నేటివ్ కృపా చర్చి పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మ, చర్చి సభ్యులు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఆయన స్పందించి అధికారులైన డీఈ హుసేన్, ఏఈ నాగార్జున, సచివాలయ కార్యదర్శి ప్రకాశ్‌లను కాలనీకి పంపారు. వారు ఆ ప్రాంతాన్ని పరిశీలించి స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం మంచినీటి సమస్యను పరిష్కరించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

### ఆకట్టుకుంటున్న సురభి నాటకాలు

పులివెందుల టౌన్ : స్థానిక గరండాల్ రివర్ ఫ్రంట్(రాణితోపు)లో రెండవ రోజు ఆదివారం నిర్వహించిన సురభి నాటక ప్రదర్శనలో భక్త ప్రహ్లాద నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. చక్రాయపేట మండలం సురభి గ్రామంలో పుట్టిన ఈ సురభి నాటకాలు దేశ వ్యాప్తంగా ఎంతో ప్రాచుర్యం పొందా యని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డిలు తెలిపారు. 6 రోజుల పాటు నిర్వహించే సురభి నాటకాలను ప్రతి ఒక్కరు తిలకించాలన్నారు.

### నేడు సంక్రాంతి కవి సమ్మేళనం

కడప కల్చరల్ : కడప నగరంలోని సాయిబాబా థియేటర్ వద్ద గల గ్రాండ్ ఇన్ సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం 5 గంటలకు సంక్రాంతి కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు సంస్థ కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు తెలిపారు.

### ఉపాధ్యాయుల డిమాండ్లు నెరవేర్చాలి

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయుల డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు కోరారు. భోగి పండుగను పురస్కరించుకుని ఆదివారం కడపలోని యూటీఎఫ్ భవన్ ఎదుట ప్రభుత్వ నిరంకుశ వైఖరి దహనం పేరుతో.. ఉపాధ్యాయులకు సంబంధించిన జీఓలను భోగిమంటల్లో దహనం చేసి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సీవీ రమణ, ఏజాస్ అహ్మద్, ఆడిట్ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు గంగన్న, శంకర్‌బాబు, గోపాల్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, విశ్వనాథ్, ప్రకాష్‌బాబు, మజ్జారి చెన్నకేశవులు, శ్రీనివాసులతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

### ప్రశంసా పత్రం అందజేత

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని డిప్యూటీ సీఎం కార్యాలయంలో జాతీయ యువజన వారోత్సవాలను పురస్కరించుకుని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా కడపకు చెందిన మౌలానా ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అ.ధ్యక్షుడు షేక్ అబ్దుల్ షబ్బీర్‌కు సోమవారం ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షబ్బీర్ 20 ఏళ్లుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. కడప నుంచి న్యూఢిల్లీ వరకు సామాజిక సేవలపై సైకిల్‌పై సాహసయాత్ర చేయడంతోపాటు మౌలానా ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సొసైటీ స్థాపించి అన్ని విధాలుగా సేవలందిస్తున్నారన్నారు. ఆయన సేవలకు గుర్తుగా ప్రశంసా పత్రం అందజేశామన్నారు.

# అంబరాన్నంటిన 'భోగి' సంబరాలు


మారుతీనగర్‌లో భోగిమంటల్లో చలి కాచుకుంటున్న ప్రజలు


శిల్పారామంలో గాలి పటాలతో చిన్నారులు

కడప కార్పొరేషన్ : కడప నగరంలో భోగి పండుగ సంబరాలు అంబరాన్నంటాయి. తెల్లవారుజామునే లోగిళ్ల ముందు ముగ్గులు వేసి, భోగి మంటలు వేసి ఉత్సాహ పూరిత వాతావరణంలో పండుగ నిర్వహించారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో కడప మార్కెట్‌కు కొత్త కళ వచ్చింది. నిత్యావసర సరుకుల దుకాణాలు, కూరగాయల మార్కెట్‌లు కిక్కిరిసిపోయాయి. వాహనాల రాకపోకలు, జనంతో అన్ని రహదారుల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ప్రతి ఇంటి ముందు ముగ్గులు, భోగి మంటలు కనువిందు చేశాయి. ప్రజలు స్నేహితులు, బంధుమిత్రులకు ప్రసార మాధ్యమాల ద్వారా శుభాకాంక్షలు చెప్పుకొని సంతోషం వ్యక్తం చేశారు.

**శిల్పారామం.. సరదాల మయం**

కడప కల్చరల్ : కడప శిల్పారామం బాలలు, యువకుల సరదాలతో హోరెత్తింది. భోగి పండుగలను పురస్కరించుకుని నిర్వాహకులు రీజినల్ సీఈఓ మునిరాజు, ఏఓ పి.శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షణలో గాలిపటాల పోటీ, భోగిమంటల వేడుకలు నిర్వహించారు. సాయంత్రం పోటీలో పాల్గొన్న చిన్నారులు గాలిపటాలు ఎగురవేశారు. పోటాపోటీగా జరిగిన ఈ కార్యక్రమం సందర్శకులకు ఉత్సాహం గొలిపింది. గాలిపటాల ఎగురవేత పోటీలో మొదటి బహుమతి పీఎస్ రక్షిత్‌రెడ్డి, ద్వితీయ బహుమతి వీరారెడ్డి, తృతీయ బహుమతి ఓబులేశు సాధించగా, వారికి నిర్వాహకులు నగదు బహుమతులు అందజేసి అభినందించారు. అనంతరం శిల్పారామం ప్రధాన ద్వారం వద్ద అధికారులు, సిబ్బంది సందర్శకులతో కలిసి పెద్దగా భోగి మంటను వెలిగించి హ్యాపీ భోగి అంటూ ఉత్సాహాన్ని చాటుకున్నారు. అనంతరం స్థానిక దేవ డ్యాన్స్ అకాడమి చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు సంక్రాంతి సంప్రదాయాలను చాటాయి. పండుగ సంబరాలను రెట్టింపు చేశాయి.


శిల్పారామంలో నృత్యం చేస్తున్న బాలురు


నగరంలో ముగ్గులు వేస్తున్న మహిళలు

## ఉత్సాహ భరితంగా ముగ్గుల పోటీలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆదివారం కడప నగరం విజయదుర్గా కాలనీలో సీఆర్ఐ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు ఉత్సాహ భరిత వాతావరణంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన యోగివేమన యూనివర్సిటీ పాలకమండలి సభ్యురాలు డాక్టర్ జానపాటి వెంకటలక్ష్మి మాట్లాడుతూ సీఆర్ఐ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. తెలుగువారు ఘనంగా నిర్వహించుకునే సంక్రాంతి పండుగ సందర్భంగా స్థానికులను ప్రోత్సహిస్తూ నిర్వహిస్తున్న ముగ్గుల పోటీకి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనడం హర్షణీయమన్నారు. ఈ పోటీలలో మొదటి బహుమతి పి.లత, రెండవ బహుమతి కల్పనా రెడ్డి, మూడవ బహుమతి రమ్య గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్ఐ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సీఆర్ఐ సునీల్ జయంత్, జిల్లా బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, సీఆర్ఐ దినేష్ కుమార్, వెంకట లక్ష్మమ్మ, సుబ్బమ్మ, కార్పొరేటర్ సుజాత, సుబ్బరాయుడు, అనిత, రాధాకృష్ణ, విజయ, కాలనీ ప్రముఖులు జయరామిరెడ్డి, ఏసీ కొండారెడ్డి, వెంకటసుబ్బయ్య, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.


ముగ్గుల పోటీని పర్యవేక్షిస్తున్న నిర్వాహకులు

# ఘనంగా గోదాదేవి కల్యాణోత్సవం


కల్యాణమూర్తులుగా స్వామి, అమ్మవార్లు


అమ్మవారి గ్రామోత్సవం

కడప కల్చరల్ : కడప నగరం దేవునికడప శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో సంక్రాంతి ఉత్సవాలలో భాగంగా ఆదివారం గోదాదేవి కల్యాణం, గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చక బృందం ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ధనుర్మాసం ప్రారంభం నుంచి ఆలయంలో ప్రత్యేకంగా గోదాదేవి రచించిన పాశురాలను 30 రోజులపాటు రోజూ ఒక్కొక్కటిగా పూజల్లో భక్తులు ఆలపించారు. ఈ ఉత్సవాలలో భాగంగా చివరిరోజు శ్రీ గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తిని తొలుత హంస వాహనంపై కొలువుదీర్చి, ఊరేగింపుగా మంగళ వాయిద్యాల మధ్య మాడవీధుల ద్వారా పుష్కరిణి వద్దకు చేర్చారు. అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్నానం పీఠంపై కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, వాసుదేవపూజ, పుణ్యాహవాచనం, అనంతరం శుద్ధజలంతో అభిషేకించి కర్పూర హారతులు ఇచ్చారు. అమ్మవారిని తిరిగి ఆలయానికి చేర్చి ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి స్వామి, అమ్మవార్లను అలంకరించి కొలువు దీర్చారు. అర్చకులు ఈ కల్యాణం ప్రత్యేకతను వివరిస్తూ గోదాదేవి చరిత్రను తెలిపారు. కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించి మాంగల్య ధారణ, తలంబ్రాలు కార్యక్రమాన్ని పూర్తి చేశారు. హాజరైన భక్తులందరికీ కార్యక్రమ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## మాలో ఎలాంటి అభిప్రాయభేదాలు లేవు

- వైఎస్సార్‌సీపీ నాయకులు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్ : తమలో ఎలాంటి అభిప్రాయ భేదాలు లేవని వైఎస్సార్‌సీపీ నాయకులు పి.జయచంద్రారెడ్డి, ఎన్.సుబ్బారెడ్డి, తోటక్రిష్ణ అన్నారు. ఆదివారం స్థానిక నెహ్రూపార్కు సమీపంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన విందులో వైఎస్సార్‌సీపీ నాయకుల మధ్య గొడవ జరిగిందని, పార్టీలో చీలక ఏర్పడిందని ఒక దినపత్రికలో వార్త ప్రచురించడం దారుణమన్నారు. చిన్న కుటుంబంలో సైతం అభిప్రాయ భేదాలు ఉండటం సహజమని, ఇంత పెద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఇలాంటి చిన్న చిన్న వైరుధ్యాలు టీ కప్పులో తుపాను లాంటివన్నారు. వీటిని ప్రతిపక్ష పార్టీలు, కొన్ని పత్రికలు చిలవలు పలువలు చేసి ఏదో జరిగిపోతోందని ప్రచారం చేయడం సరికాదన్నారు. తామంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులమని, తమలో ఎన్ని అభిప్రాయ భేదాలు ఉన్నా తామంతా పార్టీ అధిష్టానం చెప్పిన మేరకు నడుచుకుంటామన్నారు. ఇందులో ఎలాంటి అపోహలకు, అనుమానాలకు తావు లేదన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కె. సూర్యనారాయణరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి శివప్రసాద్, ఐస్‌క్రీం రవి, రాణాప్రతాప్, శ్రీరంజన్‌రెడ్డి, బాలక్రిష్ణారెడ్డి, సింధు తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులకు వీకే హోండా సౌకర్యాలు

కడప కల్చరల్ : కడప నగరం ఐటీఐ సర్కిల్‌లో గల వీకే హోండా సంక్రాంతి సందర్భంగా వాహనదారులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తోంది. నగర వాసులకు ఈ సంస్థ షోరూం సుపరిచితమే. ఇందులో వాహనాన్ని కొన్న వారికి నమ్మకమైన సర్వీసు ఇస్తామని, వాహనానికి నాణ్యమైన సర్వీసు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఎప్పటికప్పుడు నూతన ఆఫర్లు ప్రకటిస్తూ కొనుగోలుదారుల సంతోషమే ధ్యేయంగా ముందడుగు వేస్తున్నామన్నారు. వాహనదారుల సౌకర్యం కోసం ఆదివారం కూడా షోరూం పని చేస్తుందన్నారు. వీకే హోండా షోరూంలు కడపతోపాటు రాజంపేట, రైల్వేకోడూరు, వేంపల్లె, కమలాపురం, చిట్వేలి, ఖాజీపేటలలో కూడా ఉన్నాయని, ఆ ప్రాంత వాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## ఏపీ భూహక్కు చట్టం రద్దు చేయాలి

కమలాపురం : ప్రజల ఆస్తులకు భద్రత లేని ఏపీ భూహక్కు చట్టం–27/2023ను రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఆదివారం కమలాపురంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ ఆదేశాల ప్రకారం నిర్ణయాలు తీసుకునే రెవెన్యూ అధికారులు, ఇతర యంత్రాంగం ప్రజల ఆస్తులకు హక్కులను నిర్ణయిస్తారన్నారు. అలా నిర్ణయించిన హక్కులను టైటిల్ రిజిష్టర్‌లో నమోదు చేస్తారని, భూ హక్కుదారులకు ఇది శాశ్వతంగా హక్కు కల్పిస్తుందన్నారు. ఈ చట్టాన్ని తక్షణం రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ నాయకులు పాల్గొ న్నారు.